ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
సోమవారం, 16 సెప్టెంబరు 2024



ప్రకృతి నిలయం కనకగిరి

- సహజ అందాలను ఆస్వాదించాలంటే ఇక్కడి గుట్టలకు రావాల్సిందే..
- ఈ ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి కృషిచేస్తా..
- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్
- ఎనిమిది కిలోమీటర్లు నడిచి గుట్టలపైకి ఎక్కిన కలెక్టర్



కనకగిరి గుట్టల ప్రాధాన్యతను కలెక్టర్‌కు వివరిస్తున్న స్థానికులు

చండ్రుగొండ, సెప్టెంబరు 15: సహజసిద్ధమైన ప్రకృతి అందాలను ఆస్వాదించాలంటే కనకగిరి గుట్టలకు రావాల్సిందేనని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక యంత్రాంగానికి సమాచారం లేకుండా చండ్రుగొండ మండల పరిధిలోని బెండాలపాడు గ్రామ సరిహద్దుల్లో ఉన్న కనకగిరి గుట్టలను చూసేందుకు కలెక్టర్ విచ్చేశారు. స్థానికుల సహకారంతో దట్టమైన అడవుల్లో 8 కిలోమీటర్ల దూరం గుట్టలపైకి ఎక్కి అక్కడ ఉన్న కాకతీయుల కాలంనాటి ఆలయాలను సందర్శించారు. ఎత్తయిన గుట్టలపై నుంచి ప్రకృతిని పరిశీలించి ఆ ప్రాంత ప్రాధాన్యతను స్థానిక ఆదివాసీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుట్టల కింది భాగంలో ఏర్పాటు చేసిన వెదురు ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడో విదేశాల్లో ఉన్న ప్రకృతి అందాల కంటే స్థానికంగా సహజ సిద్ధంగా ఏర్పడిన ప్రకృతి అందాలే అద్భుతంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తరుపున తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా బెండాలపాడు శివారులో వెదురు ఉత్పత్తులు పరిశ్రమలో తయారైన వస్తువులను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో అశోక్‌తో పాటు స్థానికులు మాలోతు బోజ్యా నాయక్, బొర్రా సురేష్, కృష్ణ, తదితరులు ఉన్నారు.

కాల్వగండ్లు పూడ్చే పనుల్లో
వేగం పెంచండి

- రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచి మండలం మల్లాయిగూడెం వద్ద పనుల పరిశీలన



సాగర్ కాల్వ గండిపూడ్చివేత పనులు పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, సెప్టెంబరు 15: సాగర్ ఎడమకాల్వ గండి పూడ్చివేత పనుల్లో వేగం పెంచాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం హట్యతండ వద్ద సాగర్ ఎడమకాల్వ గండిపూడ్చివేత పనులను ఆదివారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాల్వకు గండ్లు పడిన ప్రదేశాలు, తాత్కాలికంగా చేపడుతున్న పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరిగినందున సాగులో ఉన్న పంటలు ఎండిపోకుండా వెంటనే సాగర్ జలాలు అందించేందుకు పనుల్లో వేగం పెంచాలని ఇంజనీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. 24గంటలూ పనులు కొనసాగించాలన్నారు. అవసరమైనమేర అదనపు యంత్రాలు, షిఫ్టులవారీగా కార్మికులు పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కాల్వ లైనింగ్ పనులు కూడా జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ సీఈ విద్యాసాగర్, ఎస్ఈ నర్సింగరావు, ఈఈ మంగళపూడి వెంకటేశ్వరరావు, డీఈ బానాల రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగమ్మ ఒడికి
గణేషుడు

- జిల్లా వ్యాప్తంగా 2,842 విగ్రహాల ప్రతిష్ఠ
- నిమజ్జనానికి సిద్ధమైన ఘాట్లు
- ఖమ్మంలో స్తంభాద్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర
- యాత్రను ప్రారంభించనున్న మంత్రి తుమ్మల
- మున్నేరు ఘాట్‌లకు 1,842 విగ్రహాలు వచ్చే అవకాశం
- కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్‌లో భారీ క్రెయిన్‌ల ఏర్పాటు
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసుశాఖ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ, కమిషనర్, మేయర్

ఖమ్మం సంక్షేమ విభాగం/ఖమ్మం క్రైం 15: నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల పూజలందుకున్న వినాయకుడు సోమవారం గంగమ్మఒడికి చేరనున్నాడు. నేడు గణేష్ నిమ్మజ్జనానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అధికారులు ఏర్పాటు పూర్తి చేశారు. ఖమ్మం నగరంలో నగర పాలక సంస్థతోపాటు పోలీసులు, స్తంభాద్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ యాత్రను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. నిమజ్జనం సందర్భంగా గతంలో ఎదురైన లోటుపాట్లను దృష్టిలో ఉంచుకొని మంత్రి తుమ్మల పర్యవేక్షణలో మున్నేరు ప్రాంతంలోని కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ ఘాట్‌ల వద్ద కేఎంసీ, పోలీసు, మత్స్యశాఖ (మిగతా 4వ పేజీలో)

భద్రాచలంలోనూ నిమజ్జన ఏర్పాట్లు 6



వరదనీటిలో మునిగిన పాండ్స్

వరదార్పణం..!

- పాలేరు బ్యాక్‌వాటర్‌లో మునిగిన భక్తరామదాసు పంపుహౌజ్
- రూ.25 కోట్ల నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా
- పరిశీలించిన లిఫ్ట్ ఇరిగేషన్స్ ప్రభుత్వ కన్సల్టెంట్ పెంటారెడ్డి
- 15రోజుల్లో ఒక యూనిట్‌ను సరిచేస్తామని అధికారుల వెల్లడి
- మత్స్యపరిశోధనా కేంద్రంపైనా వరద ప్రభావం
- కొట్టుకుపోయిన అరుదైన రకాల పరిశోధన చేపలు

కూసుమంచి, సెప్టెంబరు 15: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో పాలేరు నియోజకవర్గ వరప్రసాదయిని భక్తరామదాసు ఎత్తిపోతల పథకానికి భారీ నష్టం వాటిల్లింది. కూసుమంచి మండలం పాలేరు జలాశయం నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఎర్రగడ్డతండా వద్ద నిర్మించిన ఈ పథకం నీట మునిగింది. భారీ వరద రావడంతో జలాశయం బ్యాక్ వాటర్ పెరిగి కాల్వల్లోకి భారీగా వరద చేరడంతో అక్కడినుంచి పంప్‌హౌజ్‌లోకి వరద చేరింది. రెండు పంపులు, విద్యుత్ ప్యానళ్లు, స్టార్టర్లు నీటము నిగాయి. వర్షాలు తగ్గిన వెంటనే అధికారులు ఆయా మోటార్లను డీ వాటరింగ్ చేసి బురదను తొలగించారు.

భారీనష్టం జరిగినట్లు అధికారుల అంచనా

భారీ వరద కారణంగా భక్తరామదాసుకు అపారనష్టం వాటిల్లినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఇంజనీరింగ్ అధికారులు జరిగిన నష్టానికి అంచనా వేస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ ఎత్తిపోతల పథకాల ప్రభుత్వ అడ్వైజర్ పెంటారెడ్డి పరిశీలించారు. సుమారు రూ.25 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అదేవిధంగా ప్రాజెక్టు నుంచి ఈ సీజన్‌లోనే సాగునీరందించేలా పనులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే విద్యుత్‌ను పునరుద్ధరించారు. మోటార్లను హీటింగ్ చేయడంతోపాటు. స్టాటర్స్, ప్యానల్ బోర్డులు మార్చాల్సి ఉంది. ఐబీ సీఈ విద్యాసాగర్, ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, డీఈ రమేష్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

మత్స్యపరిశోధనా కేంద్రంపైనా వరద ప్రభావం

పాలేరు వరద మత్స్యపరిశోధనా కేంద్రానికి కూడా తీవ్రనష్టాన్ని మిగిల్చింది. ఎడమకాల్వ పక్కనే ఉన్న ఈ కేంద్రాన్ని అదే ప్రాంతంలో కాల్వకు గండిపడటంతో వరద నీరంతా చుట్టుముట్టింది. దీంతో వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన అరుదైన రకాల చేపలు, ఉత్పత్తి చేసిన చేప పిల్లలు నీటిలో కొట్టుకుపోయాయి. పరిశోధనలకు, మత్స్యకారులకు శిక్షణ కోసం ఉంచిన అనేక చేపల జాతులు వరదలో కొట్టుకుపోయినట్టు మత్స్యపరిశోధనస్థానం సీనియర్ సైంటిస్ట్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. అదేవిధంగా చేపల నిల్వకోసం ఉంచిన పాండ్స్ దెబ్బతిన్నాయి. ఈ మత్స్యపరిశోధనా కేంద్రానికి సుమారు రూ.కోటి నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు. వరద నష్టాన్ని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల పాలేరు పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి వివరించి నివేదిక అందించారు.



భక్తరామదాసు ప్రాజెక్టును పరిశీలిస్తున్న ప్రభుత్వ కన్సల్టెంట్ పెంటారెడ్డి

15రోజుల్లో ఇక యూనిట్‌ద్వారా నీరందిస్తాం
భక్తరామదాసు డీఈ బానాల రమేష్‌రెడ్డి



ఇటీవల వచ్చిన వరదలతో భక్త రామదాసు ప్రాజెక్టు మోటార్లు నీట మునిగాయి. దాంతో భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి వెళ్లారు. వారంలో నష్టం అంచనా తెలుస్తుంది. అయినా రైతులు నష్టపోకుండా సాగు నీరు అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. 15 రోజుల్లో ఒక యూనిట్‌ను నడిపేలా కృషిచేస్తున్నాం.



తడారుతున్న వరి

- చిరుపొట్ట దశలో ఎండుతున్న పైరు
- కాల్వగండ్లను వెంటనే పూడ్చి నీరివ్వాలి
- సకాలంలో నీరు అందకపోతే తీవ్ర నష్టం
- కల్లూరు మండలంలో ఎన్నెస్పీ ఆయకట్టు రైతుల వేడుకోలు

కల్లూరు, సెప్టెంబరు 15: సాగర్ ఎడమ కాల్వ రెండోజోన్ పరిధిలోని ఖమ్మం జిల్లా కల్లూరు డివిజన్ మధిర బ్రాంచ్ కాల్వకు సత్వరమే సాగునీరు అందించి ఎండిపోతున్న వరి పైరును కాపాడాలని ఈ ప్రాంతానికి చెందిన రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఇటీవల తుఫాన్‌ల ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో వరి పొలాల గట్లకు గండ్లు పడి నీరు బయటకు వెళ్లిందని రైతులు వివరించారు. కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామంలో ఆదివారం సాగర్ ఆయుకట్టులో సాగునీరు అందక ఎండిపోయే దశలో ఉన్న వరి పైరును క్షేత్రస్థాయిలో పలువురు రైతులు సందర్శించి చిరుపొట్ట దశలో ఉన్న వరి పైరును విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ సాగర్ ఎడమ కాల్వ ఎగువన కూసుమంచి వద్ద వరదతో పడిన గండిని యుద్ధప్రాతిపదికన పూడ్చివేయాలని కోరారు. ఈసారి ముందుగానే నాటు వేయడంతో ఇప్పటికే వరి పైరు చిరు పొట్ట దశకు చేరుకుందన్నారు. తమ గ్రామంలోనే సుమారు 1,500 ఎకరాల వరి పొట్ట దశలో ఉందన్నారు. ఇంకా మధిర బ్రాంచ్ కాల్వ పరిధిలో సాగర్ ఆయకట్టు కింద లింగాల, బోడిమెల్లి, వాచ్యానాయక్‌తండా, రఘునాథబంజర, చెన్నూరు. పాయాపూరు, ముచ్చవరం, యజ్ఞనారాయణపురం, వెన్నవల్లి, చిన్నకోరుకొండి, మర్లపాడు తదితర గ్రామాల్లోనూ వరి పంట చిరుపొట్ట దశలో ఉన్నందున సత్వరమే సాగునీరు అందించాలని, లేకపోతే పైరు ఎండిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధిర బ్రాంచ్ కాల్వ పరిధిలో 31వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ నేపథ్యంలో సాగర్ కాల్వకు కూసుమంచి వద్ద పడిన గండిని పూడ్చేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు, జలవనరుల శాఖ అధికారులు దృష్టిసారించాలని సాగర్ ఆయకట్టు చివరి ప్రాంత రైతులు విజ్ఞప్తి చేశారు.

యూరియా ఏదయా..?

- కొరతతో అన్నదాతల వెతలు
- బహిరంగ మార్కెట్లో అందుబాటులో లేని నత్రజని ఎరువు
- సొసైటీల్లో రేషన్ పద్ధతిలో యూరియా విక్రయాలు 4



భూముల అన్యాక్రాంతాన్ని అడ్డుకోలేని 'ఫోర్స్'

- అమలుకు నోచుకోని ఎన్‌ఫోర్స్‌మెంట్
- అక్రమ నిర్మాణాలను నిరోధించని టాస్క్‌ఫోర్స్
- విచ్చలవిడిగా నాలాలు, చెరువుల్లో నిర్మాణాలు 4

నేడు కొత్తగూడెంలో 'వ్యవసాయ' ప్రదర్శన

- రెండురోజులపాటు ప్రకాశం స్టేడియంలో నిర్వహణ 4

భద్రాద్రి పేరును
దుర్వినియోగం చేయొద్దు

- దేవస్థానం ఆనవాళ్లతో ప్రైవేటు వ్యక్తులు కార్యక్రమాలు నిర్వహించడం నిషిద్ధం
- స్వామివారి పేరిట శాంతి కల్యాణం నిర్వహణ పట్ల అభ్యంతరం
- భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవి, వైదిక బృందం



భద్రాచలం, సెప్టెంబరు 15: భద్రాచలంలో శ్రీరామ టెంపుల్ ఆఫ్ యుఎస్ఏ ఖగోళ యాత్ర బృందం ఆధ్వర్యంలో భద్రాద్రి సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించడం పట్ల భద్రాచలం దేవస్థానం అధికార, వైదిక సిబ్బంది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సదరు సంస్థ ఇటీవల నిర్వహించిన ఖగోళయాత్ర సమయంలో భద్రాద్రి శ్రీరామ టెంపుల్ ఆఫ్ యుఎస్ఏ పేరిట ఉన్న వెబ్‌సైట్‌లో భద్రాద్రి రామయ్య మూలవరుల చిత్రం పొందుపరచడం పట్ల కూడా వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సదరు వెబ్‌సైట్‌నుంచి వెంటనే మూలవరుల చిత్రాన్ని తొలగించాలని సూచించారు. భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో ఆదివారం సాయంత్రం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, కోటి రామస్వరూపాచార్య, కోటి శ్రీమన్నారాయణాచార్యులు ఇతర వైదిక సిబ్బంది విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడైనా సీతారాముల ఆలయం నిర్మించి కల్యాణం నిర్వహిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, కానీ భద్రాద్రి శ్రీరామ టెంపుల్, భద్రాద్రి శ్రీసీతారాముల శాంతికల్యాణం, ఆలయ మూలవరుల చిత్రం వాడటం పూర్తిగా నిషేధమన్నారు. భద్రాద్రి సీతారాముల కల్యాణం నిర్వహించే సర్వ హక్కులు కేవలం భద్రాద్రి దేవస్థానానికే ఉన్నాయని స్పష్టం చేశారు. మరెవరైనా వ్యక్తిగత లాభాపేక్షతో వాణిజ్యపరంగా భద్రాద్రి పేరును వినియోగిస్తే సహించేది లేదన్నారు. ఖగోళయాత్ర నిర్వహించిన సంస్థ ప్రచురించిన కరపత్రంలో భద్రాద్రి శ్రీసీతారాముల వారి శాంతికల్యాణం మంగళవారం భద్రాద్రిలో నిర్వహిస్తున్నట్లు ప్రచురించారని తెలిపారు. అలాగే వారు రూపొందించిన వెబ్‌సైట్‌లో సైతం భద్రాద్రి శ్రీరామటెంపుల్ ఆఫ్ యుఎస్ఏ అని పేర్కొంటూ మూలవరుల చిత్రాన్ని ఉపయోగించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. సదరు సంస్థ నిర్వాహకులు కల్యాణానికి తమను ఆహ్వానించేందుకు ఆదివారం ఈవో కార్యాలయానికి వచ్చిన సమయంలో కరపత్రం చూసి వారి వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించి భద్రాద్రి శ్రీ సీతారాముల శాంతికల్యాణం నిర్వహిస్తూ దేవస్థానాన్ని ఆహ్వానించడంతో భక్తులు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసినట్లు తెలిపారు.


కమిషనర్‌కు నివేదించాం

భద్రాద్రి మూలవరుల చిత్రంతోపాటు భద్రాద్రి శ్రీరామ టెంపుల్ పేరును వెబ్‌సైట్‌లో వినియోగించడం, భద్రాద్రి శ్రీసీతారాముల శాంతికల్యాణం మంగళవారం నిర్వహిస్తుండటాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు దృష్టికి నివేదించినట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కమిషనర్‌కు పంపామని, ఆయన ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఒక సంస్థ ఆగస్టు 17 నుంచి సెప్టెంబరు 17 వరకు ఖగోళ యాత్ర నిర్వహిస్తోందన్నారు. ఇందులో భద్రాద్రి దేవస్థానానికి చెందిన ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామాచార్యులు, ముఖ్య అర్చకులు పొడిచేటి సీతారాంలు దేవాదాయ శాఖ కమిషనర్ నుంచి అనుమతులు తీసుకొని వ్యక్తిగత సెలవుపై వెళ్లినట్లు తెలిపారు. ఈ యాత్రకు దేవస్థానానికి ఎటువంటి సంబంధం లేదని, అలాగే వారు నిర్వహించే హోమాలు, పూజలు, కల్యాణాలతో తమకు సంబంధం లేదని తెలిపారు. ఈ సమయంలో వారు భద్రాద్రి దేవస్థానం పేరు వినియోగించినా, భద్రాద్రి సీతారాముల కల్యాణం, పూజలు నిర్వహించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అప్పుడే స్పష్టం చేశామన్నారు. అలాగే ఆర్థికపరమైన అంశాలకు సంబంధించి ఏమైనా కేసులు న్యాయస్థానాల్లో నమోదైతే వారే బాధ్యత వహించాలని స్పష్టం చేశామన్నారు.

త్వరలో దేవస్థానం పేరుపై పేటెంట్‌కు దరఖాస్తు

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం, భద్రాద్రి సీతరాముల కల్యాణం, మూలవరుల చిత్రంపై త్వరలోనే పేటెంట్ కోసం దరఖాస్తు చేయనున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి వెల్లడించారు. ఇదిలా ఉండగా దేవస్థానం జమా ఖర్చు లెక్కల వివరాలు త్వరలో పూర్తిగా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని తెలిపారు. అలాగే దేవస్థానంలోని అన్ని విభాగాల్లో పారదర్శకత కోసం క్యూఆర్‌కోడ్ విధానాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం ముక్కోటి నాటికి 50 మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

భూముల అన్యాక్రాంతాన్ని అడ్డుకోలేని ఫోర్స్



- అమలుకు నోచుకోని ఎన్‌ఫోర్స్‌మెంట్
- అక్రమ నిర్మాణాలను నిరోధించని టాస్క్‌ఫోర్స్
- విచ్చలవిడిగా నాలాలు, చెరువుల్లో నిర్మాణాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 15: ఖమ్మం నగరం వేగంగా విస్తరిస్తోంది. హైదరాబాద్, వరంగల్ లాంటి మహానగరాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం జోరు తగ్గినా ఖమ్మంలో తగ్గటం లేదు. ఈ క్రమంలో రియల్ వ్యాపారుల దృష్టి ప్రభుత్వ స్థలాలు, కాల్వలు, అలుగులపై పడింది. సమీపంలోని మైదాన ప్రాంత సర్వే నెంబర్లకు బై నెంబర్లను జత చేసి కబ్జా చేశారు. 58, 59 జీవోలలోని కొన్ని సర్దుబాట్ల ఆధారంగా ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికి తెరలేపారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్కడ?

ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం ఉండేది. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా పోలీసు కమిషనర్, జాయింట్ కలెక్టర్, ఇరిగేషన్ ఎస్‌ఈ, రహదారులు భవనాలశాఖ ఎస్‌ఈ, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి సభ్యులుగా ఉండేవారు. ప్రతీ మూడు నెలలకు ఒక సారి ప్రభుత్వ భూములు, రహదారులు, చెర్వులు, ఇతర స్థలాలు అక్రమణలపై సమీక్షించి చర్యలను తీసుకునే వారు. అయితే కొన్నేళ్లుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విధానం అమలు కాకపోటంతో జిల్లా స్థాయిలో పర్యవేక్షణ ఇబ్బందులు ఏర్పాడ్డాయి.

ఏర్పాటుకే పరిమితమైన టాస్క్‌ఫోర్స్

2020లో టీఎస్ ఈపాస్ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం భవనాలు, బహుళ అంతస్తులకు అనుమతుల జారీ విధానం ప్రవేశపెట్టారు. ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు జీవోనెం. 201ను అమలులోకి తీసుకొచ్చారు. 2021లో పూర్వ కలెక్టర్ కర్ణన్ పర్యవేక్షణలో ఖమ్మం నగరంలోని మూడు పోలీసుస్టేషన్‌లతో పాటుగా ఖానాపురం హావేలీ పోలీసుస్టేషన్‌ను కలుపుకొని నాలుగు టాస్క్‌పోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. అయితే ఆ నాటి పరిస్థితుల వల్ల ఈ బృందాలు బలోపేతం కాలేదు. వరస ఎన్నికల నేపథ్యంలో అక్రమార్కులు చెరువులు, కాల్వల్లో భవనాలు నిర్మించారు. ఖానాపురం ప్రధాన రహదారి వెంట చెరువు భూమిలో భవనాలు వెలిశాయి. పలు వరస ఫిర్యాదులతో కేఎంసీ అధికారులు అక్రమ భవనాలను కూల్చివేశారు. దీంతో సదరు భవన యజమాని కేఎంసీ పట్టణ ప్రణాళిక ఉద్యోగులపై వ్యక్తిగత కేసులు పెట్టారు. భవనంలో విలువైన బంగారం, సామగ్రి పోయిందని రూ.7 లక్షల వరకు నష్టం వాటిల్లిందని లాయర్ ద్వారా నోటీసులు జారీ చేశారు. దీంతో కేఎంసీలోని టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లాలంటే జంకుతున్నారు.

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తాం: అభిషేక్ అగస్త్య



ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో సెంటీమీటర్ ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమణ జరగకుండా పటిష్ట చర్యలను తీసుకుంటాం. కలెక్టర్ కార్యాలయంలోని ల్యాండ్ సర్వే శాఖ నుంచి 2014 నాటి ఖమ్మం నగరం, చెర్వులు, కాల్వలు, అలుగుల మ్యాప్‌లను తెప్పించాం. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటుపై కలెక్టర్, పోలీసు కమిషనర్‌తో మాట్లాడి బృందాలను రంగంలోకి పంపిస్తాం.

ఆటో డ్రైవర్ సేవా నిరతి

- ఇద్దరు కొడుకులతో కలసి రహదారిపై గుంతలు పూడ్చివేత
- అభినందించిన వాహనదారులు

జూలూరుపాడు, సెప్టెంబరు 15: ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై గుంటలు పడటంతో వాహనదారులు ఇబ్బందులకు గురికావడం, కొన్ని ప్రమాదాలు చోటుచేసుకోవడంతో చలించిన ఓ ఆటో డ్రైవర్ తన ఇద్దరు కొడుకులతో కలసి రహదారికి మరమ్మతులు చేపట్టారు. మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన మోటపోతుల ఆనందరావు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. జూలూరుపాడు-వినోభానగర్ గ్రామాల మధ్య గల రాష్ట్రీయ రహదారి గుంతల మయంగా మారడంతో వాహదారుల రాకపోకలకు తీవ్ర అసౌర్యం కలుగుతుంది. ఆనంద్‌రావు ఇటీవల ఆటోలో ఖమ్మం వెళుతుండగా రహదారిపై ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారి గుంతల మయంగా మారినప్పటికి అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఆటో డ్రైవర్ ఆనందరావు తన కుమారులు ఆదర్శ్, జాన్సన్‌లతో కలసి జూలూరుపాడులోని ఉపమార్కెట్ యార్డు నుంచి కిలోమీటర్ మేర ఏర్పడిన గుంతల్లో మట్టి పోసి పూడ్చారు.ఆయన సేవా నిరతిని చూసి వాహనదారులు ప్రత్యేకంగా అభినందించారు.



గుంతల్లో మట్టి పోసి పూడ్చుతున్న ఆటో డ్రైవర్ మోటపోతుల ఆనంద్‌రావు



మాట్లాడుతున్న చిట్యాల శ్వేత

బాధిత మహిళలకు న్యాయం

- రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు శ్వేత

ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు15: మహిళల సమస్యలపై మహిళ కమిషన్‌లో చర్చించిన అనంతరం బాధితులకు న్యాయం జరిగేలా చూస్తా నని చిట్యాల ఐలమ్మ మనుమరాలు, చిట్యాల ఐలమ్మ ఆశయ సాధనసమితి అధ్యక్షురాలు, ఇటీవల నూతనంగా రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలుగా నియమితులైన చిట్యాల శ్వేత పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని ఓ హోటల్‌లో ఆమెను వీరనారీమణుల ఆశయ సాధనసమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తొలుత మహనీయల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా శ్వేత మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ వారసురాలిగా కాకుండా ఒక మహిళగా మహిళల సమస్యల పరిష్కారానికి తనపై బాధ్యత ఉందన్నారు. కాగా ఇటీవల మున్నేరు వరదలలో నష్టపోయిన బాధితులకు ఆశయసాధన సమితి ఆధ్వర్యంలో అతిధులు 25కేజీల బియ్యం బస్తాలను అందించారు. ఈకార్యక్రమంలో యుగం ఫౌండేషన్ చైర్మన్, పిల్లల వైద్యులు డాక్టర్ కూరపాటి ప్రదీప్, రెహనాబేగం, భద్రునాయక్ పాల్గొన్నారు.

యూరియా ఏదయా..?

- కొరతతో అన్నదాతల వెతలు
- బహిరంగ మార్కెట్లో అందుబాటులో లేని యూరియా
- సొసైటీల్లో రేషన్ పద్ధతిలో యూరియా విక్రయాలు

వైరా/ ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబరు 15: జిల్లాలోని రైతులను యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇటీవల వచ్చిన వరదలతో ఓవైపు, యూరియా లభ్యం కాక మరోవైపు అన్నదాతలు నానా అగచాట్లకు గురవుతున్నారు. ఖమ్మం మార్క్‌ఫెడ్‌లో ఉన్న యూరియా నిల్వలను కేవలం సహకార సంఘాల ద్వారా మాత్రమే రైతులకు సరఫరా చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లోని ఎరువుల డీలర్లకు ఆయూరియాను సరఫరా చేయడం లేదు.

5.21లక్షల ఎకరాల్లో పంటలు

ఖమ్మంజిల్లాలో 76, భద్రాద్రి కొత్తగూడెంలో 22 మొత్తం 98సహకార సంఘాలు మాత్రమే పరిమిత సంఖ్యలో ఉండటంతో అరకొరగా ఉన్న యూరియా అందక రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఖమ్మంజిల్లాలో దాదాపు 1.97లక్షల ఎకరాల్లో పత్తి, 2.63లక్షల ఎకరాల్లో వరి సహా మిర్చి ఇతర అన్నిరకాల పంటలు 5.21లక్షల ఎకరాల్లో సాగుచేశారు. ప్రస్తుతం వరిసాగు ముమ్మరంగా జరుగుతుంది. ఈ తరుణంలో



యూరియా కోసం వేలిముద్ర వేస్తున్న రైతు

రైతులకు యూరియా అవసరం ఎంతగానో ఉంది. అయినప్పటికీ ఎరువుల దుకాణాల్లో ఒక్క బస్తా యూరియా కూడా లభించటం లేదు.

నిండుకున్న నిల్వలు..

గత నెలరోజుల నుంచి ప్రైవేట్ దుకాణాలకు రైతుల అవసరాల మేరకు ఆయా కంపెనీలు యూరియాను సక్రమంగా సరఫరా చేయకపోవడంతో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు అందుబాటులో లేకుండా పోయింది. ఒకవేళ ప్రైవేట్ దుకాణాలకు అరకొరగా వచ్చే యూరియాకు కొన్ని కంపెనీలు ఇతర ఉత్పత్తులను భారీగా లింకులు పెట్టి వ్యాపారం చేస్తుండటంతో డీలర్ల వద్ద యూరియా నిల్వలు నిండుకున్నాయి. కేవలం సహకార సంఘంలోనే ప్రభుత్వం కొంత యూరియాను అందుబాటులో ఉంచడంతో ఆ గ్రామాల రైతులు సహకార సంఘాల వద్ద ఎగబడుతున్నారు.

డీలర్లకు సరఫరా లేదు

మార్క్‌ఫెడ్ వద్ద రైతుల అవసరాల మేరకు గత ఐదునెలల నుంచి సుమారు 35వేల మెట్రిక్ టన్నుల యూరియాను గోదాముల్లో నిల్వ చేసింది. ఈ సరుకును సహకార సంఘాలతోపాటు మార్క్‌ఫెడ్ అనుమతులు పొందిన ప్రైవేట్ డీలర్లకు కూడా అందుబాటులో ఉంచితే రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా సులభతరంగా లభిస్తుంది. అయితే అందుకు భిన్నంగా మార్క్‌ఫెడ్ అనుమతులు ఉన్న ఎరువుల డీలర్లకు కూడా యూరియాను సరఫరా చేయకుండా కేవలం సహకార సంఘాలకు మాత్రమే పరిమితం చేయడంతో సరైన పంపిణీ వ్యవస్థ లేక రైతులు దూరాభారంతో అనేక వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

అధిక ధరలు..

యూరియా బస్తా ప్రభుత్వ నిర్ధారిత ధర ప్రకారం రూ.260 కాగా ప్రస్తుతం నల్లబజారులో రూ.300వరకు విక్రయిస్తున్నారు. కొన్ని పీఏసీఎస్‌లు రూ.325కు లభిస్తోంది. చిల్లర వ్యాపారులు రూ.290కి అదనంగా కిరాయి, దిగుమతి కలిపి రూ.320 పడుతోందని చెబుతున్నారు. హోల్‌సేల్‌గా డీఏపీ బస్తా రూ.1330కి విక్రయిస్తున్నారు.

భద్రాచలం వద్ద 34.9 అడుగులకు చేరిన గోదావరి

భద్రాచలం, సెప్టెంబరు 15: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 34.9 అడుగులకు తగ్గింది. శనివారం రాత్రి 10 గంటలకు 38.9 అడుగులున్న గోదావరి ఆదివారం ఉదయం 6 గంటలకు 38.3 అడుగకుల తగ్గింది. అలాగే మధ్యాహ్నం 1 గంటకు 36.8, సాయంత్రం 6 గంటలకు 34.9 అడుగులకు తగ్గింది.

జాతీయ వైద్య టాస్క్‌ఫోర్స్ ఉప కమిటీ సభ్యుడిగా మాదాల



మధిర, సెప్టెంబరు 15: కోల్‌కత్తాలో మహిళా వైద్యురాలు హత్య తర్వాత సుప్రీం కోర్టు ఆదేశాలపై కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఏర్పాటుచేసిన సంస్కరణల కమిటీలో మధిరకు చెందిన డా.మాదాల కిరణ్‌కు చోటు దక్కింది. హైదరాబాద్ గాంధీ హాస్పిటల్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా. కిరణ్ ఐఎంఏ జాతీయ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. కేంద్రం జాతీయ స్థాయిలో వైద్యుల పనిపరిస్థితులు, రక్షణ, సంస్కరణలు విషయమై నాలుగు కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీల్లో జాతీయ స్థాయిలో వివిధ విభాగాలనుంచి ఒక్కొక్కరిని సభ్యులుగా తీసుకున్నారు. మొత్తం 16మందిని తీసుకోగా అందులో ఒక కమిటీలో దేశవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యుల సంఘం తరుపున డా. కిరణ్ ఒక్కడికే సభ్యుడిగా స్థానం లభించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాతినిత్యం వహించిన ఒకే ఒక్కడు కావడం తెలంగాణనుంచి తొలిసారికావడం విశేషం.

మట్టి గణపతే నమః





ఎనిమిది అడుగుల విగ్రహం, సంతోష్

- రూపు నిచ్చిన కొత్తగూడెం వాసి
- ఆకట్టుకున్న ఎనిమిది అడుగుల విగ్రహం
- పర్యావరణ పరిరక్షకుడు సంతోష్‌కు పలువురి అభినందనలు

కొత్తగూడెం సాంస్కృతికం, సెప్టెంబరు 15: మట్టిని తెచ్చి ఎనిమిది అడుగుల మహాగణపతిని తీర్చిదిద్ది పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతూ భక్తిని చాటుకుంటున్నాడు కొత్తగూడెం వాసి. కొత్తగూడెం గణేష్‌టెంపుల్ ఏరియాకు చెందిన కందుకూరి సంతోష్‌రాజ్ వృత్తి రీత్యా మల్టీమీడియా గ్రాడ్యుయేట్ (కాన్సెప్ట్ ఆర్టిస్ట్) వృత్తిలో ఉన్నారు. అయితే అందుకు భిన్నంగా పర్యావరణ పరిరక్షణహితం కోసం ఇకో ఫ్రెండ్లీ గణపతిని పూజించడంలో ఉన్న ప్రయోజనాలను తెలియచేస్తూ ఎనిమిది అడుగుల గణపతి మట్టి విగ్రహాన్ని తయారు చేశారు.

ఈ మట్టి గణపతి విగ్రహానికి మేదరబస్తీలోని వీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సంతోష్‌రాజ్‌ను విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శాలువాలతో సత్కరించారు. సంతోష్ కేజీఎఫ్-2, ఆర్‌ఆర్‌ఆర్, కల్కి వంటిభారీ సినిమాలకు గ్రాఫిక్స్ (ప్రీ విజువలేషన్ వర్క్స్) చేసిన ఘనత ఆయన దక్కింది.

నేడు గంగమ్మ ఒడికి గణేషుడు

(3వ పేజీ తరువాయి)

అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

మున్నేరు వచ్చే విగ్రహాలు 1,842

ఈ సంవత్సరం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 2,784గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అయితే వీటిలో ఖమ్మం నగరంలోని మున్నేరు కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ ఘాట్‌లకు మొత్తం 1,842 గణేశ్ విగ్రహాలు వస్తాయని కేఎంసీ, పోలీసుశాఖల అధికారులు వివరాలు సేకరించారు. వీటిలో ఇప్పటికే 242 విగ్రహాలు 3, 5వ రోజులలో నిమజ్జనం చేశారు. 9వ రోజు(సోమవారం) మొత్తం 700 విగ్రహాలు నిమజ్జనానికి వస్తాయని అధికారులు అంచనాలు వేశారు. కాల్వొడ్డులో 500, ప్రకాశ్‌నగర్‌లో 200 విగ్రహాలకు పైగా వచ్చే అవకాశం ఉంది. ఇందుకోసం 360 డిగ్రీ క్రెయిన్‌లు 4, చిన్న క్రెయిన్లు 10, సీసీ కెమెరాలు 14, గజ ఈతగాళ్లు 300, మత్స్యశాఖ నుంచి బోట్లు సిద్ధం చేశారు. నిమజ్జన ఘాట్ల వద్ద భారీకేడింగ్, లైటింగ్ పూర్తి చేశారు. పారిశుద్య నిర్వహణ కోసం ఆరుగురు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లతో 100 మంది కార్మికులను కేటాయించారు. పోలీసు కమిషనర్ ఆధ్వర్యంలో ఏసీపీలు 7, సీఐలు 18, ఎస్‌ఐలు 62, ఏఎస్‌ఐలు 175, కానిస్టేబుల్స్ 405, హోంగార్డులు 159 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జన సమయంలో వాహనాలు ఎదురేదురుగా రాకుండా రూట్ సిద్ధం చేశారు.

పెరిగిన అధికారుల పర్యవేక్షణ

మున్నేరు వరదల నేపథ్యంలో గణేష్ నిమజ్జనంపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. రెవెన్యూశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో మేయర్ పునకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక చొరవ తీసుకొని కాల్వొడ్డులో అప్రోచ్ రహదారిని పది అడుగుల ఎత్తులో నిర్మించారు.

కాల్వొడ్డు నిమజ్జన ప్రాంతంలోనే కేబుల్ వంతెన నిర్మాణ పనులు జరగుతుండటం సమస్యగా మారింది. కేబుల్ వంతెన పిల్లర్ల కోసం మున్నేరులో తీయించిన బెడ్‌ను మూసివేశారు.

ఆ ప్రాంతానికి వాహనాలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రకాశ్‌నగర్ వద్ద కూడా ఏర్పాట్లు చేశారు. మూడు రోజులుగా ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు పోలీసు కమిషనర్ సునీల్‌దత్త, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నారు.

నేడు భద్రాచలంలో గణేష్ నిమజ్జనం

- నిమజ్జన ఘాట్ వద్ద ఏర్పాట్లు పూర్తి
- ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ, ఐటీడీఏ పీవోలు

భద్రాచలం, సెప్టెంబరు 15: భద్రాచలం వద్ద నేడు గణనాధుల నిమజ్జనం ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు తెలంగాణతో పాటు ఏపీ నుంచి కూడా విగ్రహాలను భద్రాచలానికి భక్తమండళ్ల నిర్వాహకులు తీసుకురానున్నారు. ఇందుకు అనుగుణంగా 24 గంటల పాటు నిమజ్జనఘాట్ వద్ద విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేశారు. నిమజ్జనం చేసేందుకు ఆరు క్రేన్లు, పది బోట్లు, మూడు లాంఛీలను వినియోగించనున్నారు. అలాగే 60 మంది గజ ఈతగాళ్ల మూడు షిఫ్టుల్లో 24 గంటల పాటు సేవలందించనున్నారు.

భక్తులు స్నానాలు చేసేందుకు షవర్ల ఏర్పాటు

గోదావరి వరద నీరు 30 అడుగులకు పైగా ఉండటంతో భక్తులకు నదిలోకి దిగి స్నానాలు చేయకుండా నది ఒడ్డున షవర్లను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా రక్షణ చర్యలు తీసుకోనున్నారు. ఎన్డీఆర్‌ఎఫ్, డీడీఆర్‌ఎఫ్‌కు చెందిన సిబ్బంది గోదావరి నదీ తీరంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భక్తులను రక్షించేందుకు విదులు నిర్వహించనున్నారు.

250 మందితో పోలీసు బందోబస్తు

గణేష్ నిమజ్జనంను పురస్కరించుకొని 250 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఆరుగురు సీఐలు, 10 మంది ఎస్సైలతో పాటు 250 మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటారు. భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ శంక్వార్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాగా భద్రాచలం పట్టణంలో 24 గంటలు సాయుధ పోలీసు బలగాలు గస్తీ తిరగనుండగా చెకింగ్‌లు సైతం నిర్వహించనున్నారు.



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ, పీవో

నిమజ్జనం సాగేది ఇలా

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం వచ్చే గణనాధులు గోదావరి వారధి మీదుగా మెయిన్ రోడ్డు, అంబేద్కర్ సెంటర్, కూనవరం రోడ్డు, సీఆర్‌పీఎఫ్ క్యాంపు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మీదుగా నిమజ్జన ఘాట్‌కు చేరుకోనున్నాయి. అక్కడ గణేష్ విగ్రహాలను క్రేన్ల ద్వారా దించిన అనంతరం తిరిగి ఆ వాహనాలు కరకట్టపై నుంచి శిల్పినగర్ వద్ద ఉన్న ర్యాంపు ద్వారా కిందకు వెళ్లనున్నాయి.

బస్టాండ్‌లోకి ప్రైవేటు వాహనాలు

- చోద్యం చూస్తున్న అధికారులు
- ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకం

ఖమ్మం ఖానాపురం హవేలీ, సెప్టెంబరు 15: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ నూతన బస్టాండ్‌లోనికి ప్రైవేట్ వాహనాలు వస్తూ ఆర్టీసీ ఆదాయానికి గండిపెడుతు న్నాయి. నిబంధనల ప్రకారం బస్టాండ్ పరిసరాలలోకి ప్రైవేటు వాహనాలు ప్రయాణికుల కోసం రావడం నిషేధం. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రైవేటు వాహనాల యజమానులు యథేచ్ఛగా ప్రయాణికులను తీసుకుని వెళుతున్నారు. హైదరాబాద్, విజయవాడ, వరంగల్, సూర్యాపేట ప్రాంతాలకు వాహనాలను నడుపు తూ డబ్బులు దండుకుంటున్నారు. సొంత వాహనాలు ఉన్న యజమానులు కొందరు డ్రైవర్లను ఏర్పాటు చేసుకుని మరీ ఈ దందా సాగిస్తున్నారు. రాత్రిపూట కార్ల యజమానులు బస్టాండ్‌లోకి వెళ్లిమరీ ప్రయాణికులను తీసుకోని వస్తున్నారనే విమర్శలు వినపడుతున్నా డ్యూటీలో ఉన్న ఆర్టీసీ సిబ్బంది వారిపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవటంపై అనేక విమర్శలు వినపడుతున్నాయి. ఆర్టీసీ సిబ్బందికి తెలిసే ప్రైవేటు వాహనదారులు ఆ దందా చేస్తున్నట్లు



బస్టాండ్ పక్కనే ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ప్రైవేటు వాహనాలు

సమాచారం. బస్సులు వెళ్ళే ప్రధాన దారి వెంట ఒక్క ద్విచక్రవాహనాన్ని వెళ్లనివ్వని సెక్యూరిటీ ఎదురుగానే ప్రైవేటు దందాను మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

బస్టాండ్ ఎదురుగా దందా..

కొత్త బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న రోడ్డుకు పక్కగా ప్రైవేటు వాహనాలను నిలుపుతూ ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతున్నారు. బస్టాండ్‌లోకి వచ్చే ప్రయాణికులను లోనికి వెళ్లనివ్వకుండా తమ వాహనాలను ఎక్కండని వెంటపడుతున్నారు. సురక్షితమైన ప్రయాణానికి మారుపేరుగా మారిన ఆర్టీసీలో ఎంతో సుఖవంతమైన ప్రయాణ అవకాశం ఉండగా, ప్రైవేటు వాహనాల వారు ప్రమాదకరంగా మారుతున్నారు. వాహనాలలో అనుమతి లేకున్నా కిక్కిరిసన సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. రోజుకు కనీసం 100 మంది ప్రయాణికులను ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

పట్టించుకోని సెక్యూరిటీ

ప్రయాణికులు బస్టాండ్ బయట, పార్కింగ్ ప్రాంతంలో వాహనాలను నిలిపి తమ వారిని లోనికి పంపిస్తుంటారు. అయితే బస్టాండ్ బయట ప్రైవేటు వాహనాలు ప్రయాణికుల కోసం నిలిపి ఉంచి.. నిజమైన ప్రయాణికులకు అడ్డంకిగా మారారు. ఇంతా జరుగుతున్నా ఆర్టీసి సిబ్బంది, అధికారులు, సెక్యూరిటీ వాళ్లు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.రోజుకు 10 నుంచి 15 సొంత వాహనదారుల కార్లు బస్టాండ్ వద్దకు వచ్చి ప్రయాణికులను ఎక్కించుకోని వెళ్తుంటారు. ఆ వాహనాలు బస్టాండ్ సెక్యురిటీ అధికారులకు తెల్సినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

నేడు కొత్తగూడెంలో 'వ్యవసాయ' ప్రదర్శన

- రెండురోజులపాటు ప్రకాశం స్టేడియంలో నిర్వహణ
- హాజరుకానున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- ప్రజాపాలన దినోత్సవంలో పతాకావిష్కరణ చేయనున్న మంత్రి

కొత్తగూడెం, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో సింగరేణి ప్రకాశంస్టేడియం గ్రౌండ్‌లో ఈ నెల 16, 17 తేదీల్లో రైతులకు సంబంధించిన వ్యవసాయ అనుబంధశాఖల వారు నిర్వహించనున్న వ్యవసాయ సాంకేతిక ప్రదర్శన జరగనుంది. ఈ ప్రదర్శన ప్రారంభోత్సవానికి వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రైతులకు అవసరమయ్యే ఆధునిక వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, వివిధ పంటల మేలైన విత్తనాలు ప్రదర్శన, సుస్థిర వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయం, ఉద్యాన, పంటల ప్రదర్శన, మత్స్య, పాడిపశువుల ప్రదర్శన నిర్వహించనున్నారు.

ఈ నెల 17వ తేదీన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ సింగరేణి ప్రకాశంస్టేడియం గ్రౌండ్‌లో మంత్రి తుమ్మల చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ నెల 17న ఉదయం 9.50గంటలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొత్తగూడెంలోని సింగరేణి ప్రకాశం గ్రౌండ్‌కు చేరుకోనున్నారు. ఉదయం 10గంటలకు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించనున్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించనున్నారు. అనంతరం పోలీస్ గౌరవవందనం స్వీకరించనున్నారు. ఆ తర్వాత 10.20గంటలకు ఏర్పాటు చేసిన వ్యవసాయ అనుబంధ శాఖల స్టాల్స్‌ను పరిశీలించనున్నారు.



సింగరేణి ప్రకాశంస్టేడియం గ్రౌండ్‌లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

క్రైం సమాచారం

భార్య పుట్టింటికి వెళ్లిందని..
మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య


వంశీ(ఫైల్)

చింతకాని, సెప్టెంబరు 15: భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని వందనం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్ల మండలం అనంతారం గ్రామానికి చెందిన తప్పెట వంశీ (26) ఖమ్మం నగరంలో నెట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఖమ్మం నగరానికి చెందిన ఓ యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారడంతో ఆమెను గతేడాది ప్రేమ వివాహం చేసుకున్నాడు. కాగా ఇటీవల ఇరువురి మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత పది రోజుల క్రితం మృతుడి భార్యను ఆమె తల్లిదండ్రులు తీసుకువెళ్లారు. నాటి నుంచి మనోవేదనతో బాధపడుతున్నాడు. శనివారం మధ్యాహ్నం ఖమ్మం వెళ్తున్నాని ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. రాత్రి 10 గంటలకు తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంటికి వస్తానని చెప్పి ఇంటికి వెళ్లలేదు. తన ద్వి చక్ర వాహనంపై వందనం గ్రామ శివారున చింతకాని-ఖమ్మం ప్రధాన రహదారి పక్కన ఉన్న గంగమ్మ గుడిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన అనంతారం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడి ద్వారా సమాచారం తెలుసుకున్న వంశీ తల్లిదండ్రులు ఆలయం వద్దకు చేరుకుని తమ కుమారుడిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి తండ్రి జకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో కేటీపీఎస్ కార్మికుడు...

పాల్వంచ: కుటుంబ కలహాలతో కేటీపీఎస్ కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాల్వంచలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మల్లూరు శ్రీకాంత్(45) స్థానిక కేటీపీఎస్ 7వ దశలో జేపీఏగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ మధ్య కాలంలో కుటుంబ సభ్యులతో కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో తన స్నేహితుడికి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. దీంతో సదరు స్నేహితుడు పక్కింటివారిని అప్రమత్తం చేశాడు. వారు వెళ్లి చూసేసరికి అప్పటికే అతడు ఫ్యానుకు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో వారు మృతుడి భార్య నవీనకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు పరిశీలించి చూడగా, అప్పటికే శ్రీకాంత్ మృతి చెంది ఉన్నాడు. శ్రీకాంత్ భార్య నవీన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


ఏసురాజు(ఫైల్)

దమ్మపేట, సెప్టెంబరు15: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మొద్దులగూడెం క్రాస్‌రోడ్ వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మపేట పంచాయతీ పరిధిలోని నల్లకుంట గ్రామానికి చెందిన వూకె ఏసురాజు(31) తన ద్విచక్ర వాహనంపై శనివారం రాత్రి సత్తుపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా, మొద్దులగూడెం క్రాస్ రోడ్ వద్ద వాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు ఈఘటనలో తీవ్రగాయాలైన అతడిని సత్తుపల్లి వైద్యశాలకు తరలించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఇల్లెందురూరల్: ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ఇల్లెందు మండలం సుభాష్‌నగర్ సెంటర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఇల్లెందు మండలం ఏపెలగడ్డ తండాకు చెందిన బానోత్ తులసీ(80) భిక్షాటన చేస్తూ జీవిస్తుంది. ఈక్రమంలో సుభాష్‌నగర్ సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా ఇల్లెందు నుంచి ఖమ్మం వెళుతున్న ఆర్టీసీ బుస్సు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంపై ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనారోగ్యంతో మార్కెట్ అసిస్టెంట్ సెక్రటరీ..


వజీరుద్దీన్(ఫైల్)

ఖమ్మంమార్కెట్, సెప్టెంబరు 15: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అసిస్టెంట్ సెక్రెటరీగా పనిచేస్తున్న వజీరుద్దీన్(43) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందా డు. కాటన్ యార్డు ఇన్‌చార్జిగా గత కొద్ది రోజులుగా విధులు నిర్వహిస్తున్నాడు. గత పది రోజులుగా లోబీపీతో బాధపడుతున్నాడు. కాగా శనివారం రాత్రి మరోసారి ఇబ్బంది పడుతుండడంతో కుటుంబ సభ్యులు వెంటనే అతడిని హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతికి ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ ప్రవీణ్‌రెడ్డి, గ్రేడ్ టూ సెక్రటరీ సృజన్‌బాబు, అసిస్టెంట్ సెక్రటరీ వీరాంజనేయులు, పలువురు ఉద్యోగులు సంతాపం ప్రకటించారు.

ఆళ్లపల్లిలో నవజాత శిశువు..

ఆళ్లపల్లి, సెప్టెంబరు15: మండల పరిధిలోని తిర్లాపురం గ్రామానికి చెందిన ఎట్టి మౌనిక రెండో కాన్పు కోసం ఆదివారం ఉదయం మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వచ్చింది. వైద్యులు ఆమెను పరీక్షించి సాయంత్రం నాలుగు గంటల సమయంలో కాన్పు చేశారు. ఆమె బాబుకు జన్మనిచ్చింది. శిశువులో చలనం లేదని వైద్యులు తల్లి, కొడుకును కొత్తగూడెం తరలించారు. కొత్తగూడెంలో శిశువుని పరిశీలించి వైద్య సిబ్బంది శిశువు మృతి చెందినట్లు తెలిపారని కుటుంబ సభ్యులు వివరించారు. మౌనిక ఎనిమిది నెలల గర్భిణి తెలిసి కూడా పీహెచ్‌సీలో గంటల తరబడి నిర్లక్ష్యం చేశారని ఆరోపిస్తున్నారు. శిశువు మృతి చెందినట్లు ఉన్నతాధికారులకు తెలిస్తే ఇబ్బంది వస్తుందనే వైద్య సిబ్బంది కొత్తగూడెం తరలించారని విశ్వసనీయ సమాచారం.

వాగులో పడి వ్యక్తి ..

బోనకల్, సెప్టెంబరు 15: బోనకల్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం వాగులో మృతి చెంది ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యార్లగడ్డ సాంబయ్య(36) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 13వ తేది నుంచి తమ కుమారుడు కనిపించడం లేదని, పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు వెతకగా ఆళ్లపాడు వెళ్లే మార్గంలో ఉన్న వాగులో మృతదేహం కనిపించింది. ఈ సంఘటన పై ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అనుమానాస్పదంగా మృతి చెంది ఉండటం పై విచారణ చేసి న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

బిల్డింగ్‌పై నుంచి దూకి ఒకరు..

ఖమ్మం క్రైం సెప్టెంబరు 12: బిల్డింగ్ పై నుంచి దూకి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం ఖమ్మం నగరంలో జరిగింది. ఇందిరానగర్‌లోని నిర్మాణంలో ఉన్న మూడు అంతస్తుల భవనం పై నుంచి సుమారు 30 ఏళ్ల వయసున్న వ్యక్తి దూకి మృతి చెందాడు. అది గమనించిన స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీకి తరలించారు. కాగా మృతుడి వెంట నలుగురు వెంటపడుతండటంతో తప్పించుకోలేక బిల్డింగ్ పై నుంచి దూకినట్లు స్థానికులు అంటున్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తుండగా, నగరానికి చెందిన ఇద్దరు యువకులని వేరే ప్రాంతానికి చెందిన మరో ఇద్దరు యువకులు ఉన్నట్లుగా అనుమానం వ్యక్తమవుతున్నట్లు సమాచారం. అదేవిధంగా మృతుడి జేబులో మలినేని కళ్యాణ్ చక్రవర్తి అని ఉన్న క్రెడిట్‌కార్డ్ లభించినట్లు తెలిసింది. దొంగ అనుకుని నలుగురు వెంటపడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా ఈ ఘటనపై పోలీసులను వివరణ అడగగా విచారణ చేస్తున్నామని, వివరాలు తెలియరాలేదని తెలిపారు.

కలపను తరలిస్తున్న వాహనం పట్టివేత?

ఆళ్లపల్లి, సెప్టెంబరు15: టేకు ఫర్నిచర్‌తో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న బొలెరో వాహనాన్ని శనివారం రాత్రి అటవీశాఖ అధికారులు పట్టుకోవడంతో మర్కోడు గ్రామంలో తీవ్ర చర్చ జరుగుతుంది. రేగళ్ల రేంజి పరిధిలోని మర్కోడు గ్రామంలో శనివారం బొలేర వాహనంలో టేకు కలపతో తయారు చేసిన వస్తువులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు ఆ వాహనంలో కలపను గుర్తించి మర్కోడు అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. పట్టుకున్న బొలెరాలో మంచంతో పాటు ఇతర ఫర్నిచర్లు కూడా ఉన్నాయా..? లేక మంచం ఒక్కటే ఉందా అనేది గ్రామంలో చర్చ సాగుతుంది. ఈ విషయం మాత్రం అటవీశాఖ అధికారుల దగ్గర గోప్యంగా ఉంది. శనివారం రాత్రి ఫర్నిచర్‌తో పట్టుకున్న బొలెరా వాహనం పై కొంత కాలంగా అటవీశాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టినట్టు గ్రామంలో చర్చ జరుగుతుంది. రూ. 15 వేలు జరిమానా విధించి కలప, ఆ వాహనాన్ని సదరు వ్యక్తికి అప్పగించినట్టు సమాచారం. ఈ విషయమై రేగళ్ల రేంజర్ జశ్వంత్‌ను వివరణ కోరగా బొలెరా, కలప పట్టుకున్నది వాస్తవమే అని అన్నారు.

వైద్య విద్య ప్రవేశాలపై విద్యార్థుల్లో ఆందోళన

▸ సుప్రీం కోర్టును ఆశ్రయించిన రాష్ట్ర ప్రభుత్వం



సత్తుపల్లి, సెప్టెంబరు 15: వైద్య విద్య అడ్మిషన్లకు సంబంధించి రాష్ట్ర కోర్టు ప్రభుత్వానికి ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో విద్యార్థులు, వారితల్లిదండ్రులలో తీవ్ర ఆందోళన నెలకొంది. వైద్య విద్యా ప్రవేశాలకు సంబంధించి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జారీ స్థానికతపై చేసిన కొత్త జీవో వివాదాస్పదమైంది. దీని వల్ల ఇతర రాష్ట్రాల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని, తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తం అయింది. కొత్త ఉత్తర్వుల మేరకు కనీసం కౌన్సిలింగ్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేని పరిస్థితి విద్యార్థులకు ఎదురైంది. దీంతో హైకోర్టు జోక్యంతో ముందుగా దరఖాస్తుకు అవకాశం ఇవ్వాలని సూచించిన విషయం విధితమే. విచారణ అనంతరం స్థానికతకు సంబంధించి సరైన మార్గదర్శకాలు ప్రభుత్వం రూపొందించాలని ఆదేశించింది. దీంతో హైకోర్టు ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో టెన్షన్ నెలకొంది.

ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి గాను ఆగస్టు నెల మూడో తేదీన కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్శిటీ నోటీఫికేషన్ జారీ చేసింది. గత నెల 19వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం గతంతో ఉన్న జీవోకు జోడిస్తూ జీవో 33 జారీ చేసింది. ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో అడ్మిషన్ల నిబంధనలు-2017ను ఉల్లంఘిస్తూ ఈ జీవో పూర్తిగా విరుద్ధమని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటి జీవోకు జోడిస్తూ జారీ చేసిన 33జీవో ప్రకారం విద్యార్థులు 9, 10 తరగతులతో పాటు ఇంటర్ స్థానికంగా చదివి ఉండాలి. పరీక్షలు కూడా ఇక్కడే రాయాల్సి ఉంటుంది. అంతే కాక రాష్ట్రంలోనే నివశిస్తూ ఉండాలనేది జీవో సారాంశం. ఇది చట్ట విరుద్ధమని విద్యార్థులు వాదిస్తున్నారు. వైద్య విద్య సీట్ల భర్తీలో శాశ్వత నివాసితులైన విద్యార్థులను స్థానికులుగానే పరిగణించాలని గతేడాది హైకోర్టు స్పష్టం చేసిందని, ఈ మేరకు గత విద్యా సంవత్సరంలో సీట్లుభర్తీ చేయాలని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్శిటీని కోర్టు ఆదేశించింది. ఈ జీవో వల్ల ఇతర రాష్ట్రాల విద్యార్థులకు న్యాయం జరుగుతోందని, తెలంగాణలోని విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ మన రాష్ట్రంలో చదివిన విద్యార్థులు లోకల్ అవుతున్నారు. కాని ఇక్కడే స్థిరనివాసం ఉన్నా కొందరు విద్యార్థులు మాత్రం బయట చదివిన కారణంగా నాన్ లోకల్ అవుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు.

స్థానికతపై హైకోర్టు ఆదేశాలు

ఈ జీవో ప్రకారం తెలంగాణ విద్యార్థులు 1,150 మంది నాన్‌లోకల్ అవుతున్నారని, వీరిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన వారు కూడా 90 మంది వరకూ ఉన్నారని చెబుతున్నారు. వీరిలో రాష్ట్రం నలుమూలల నుంచి 170 మంది విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. వీరిలో 42 మంది ఉమ్మడి ఖమ్మం జిల్లా వారు కూడా ఉన్నారు. విచారణ అనంతరం స్థానికతపై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆదేశించింది.

హైకోర్టు ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానికతపై మార్గదర్శకాలు ప్రభుత్వం రూపొందిస్తుందని విద్యార్థులు ఆశించారు. దీని వల్ల తమకు న్యాయం జరుగుతందని అనుకుంటున్న తరుణంలో సుప్రీంకోర్టుకు కేసు వెళ్లడంతో విద్యార్థులు తమ భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నారు. కోర్టు తీర్పు వచ్చిన తరువాత తీర్పునకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగాలి. ఈ క్రమంలో కౌన్సిలింగ్ ఆలస్యం అవుతుందని, వైద్య విద్యా ప్రవేశాలపై కొందరు ఆందోళన చెందుతుండగా అడ్మిషన్ల ప్రక్రియ జాప్యం జరగడం వల్ల భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాం

▸ బీజేపీ కర్ణాటక బెల్గాం దక్షిణ ఎమ్మెల్యే అభయ్‌పటేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభయ్‌పటేల్

ఖమ్మంబైపాస్‌రోడ్, సెప్టెంబరు15: తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలో కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నారని బీజేపీ కర్ణాటక బెల్గాం దక్షిణ ఎమ్మెల్యే అభయ్‌పటేల్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో భా గంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బూత్‌కమిటీ నుంచి ప్రతి కార్యకర్త ప్రతి ఇంటికి తిరిగి బీజేపీ సభ్యత్వాలు చేర్పించి ప్రతి ఒక్కరు చేరేలా చూడాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ప్రజలు మార్పు కోరుకునేందుకు పెద్దఎత్తున ఓట్లు వేసి 8మంది ఎంపీలను గెలిపించారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా బీజేపీకి అత్యధికంగా ఓట్లువేసి గెలిపిస్తారని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని అందుకు ప్రతి కార్యకర్త ఒక సైనికుడులా పనిచేసే విధంగా ముందుకు పోవాలన్నారు. గతంలో ఉన్న సభ్యత్వాల కంటే అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయించి పార్టీ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ ఈసభ్యత్వ కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త అవకాశంగా తీసుకుని ప్రజల వద్దకు చేరుకోవాలన్నారు. బీజేపీ పార్లమెంట్ కంటెస్టడ్ అభ్యర్థి తాండ్ర వినోదరావు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో జిల్లాలో పార్టీ విజయఢంకా మోగించాలని, అందుకోసం ప్రతి కార్యకర్త ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ఈకార్యక్రమంలో జబీపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, తాండ్ర వినోదరావు, యడ్ల అశోక్‌రెడ్డి, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, శ్యామ్‌రాథోడ్, రవి, మంద సరస్వతి, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ (ట్రైనీ) పోస్టుల భర్తీ కోసం రాత పరీక్ష


పరీక్షను పరిశీలిస్తున్న సింగరేణి అధికారులు

కొత్తగూడెం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న ఎలక్ట్రీషియన్ (ట్రైనీ) - క్యాటగిరి-1 పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేసేందుకు ఆదివారం సింగరేణి మహిళ డిగ్రీ, పీజీ కళాశాలల రాత పరీక్షను నిర్వహించారు. 133 ఖాళీలకు గాను, అర్హులైన 178 అభ్యర్థులకు అధికారులు హాల్ టిక్కెట్లు జారీ చేశారు. కాగా పరీక్షకు 150మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ రాత పరీక్ష సెక్యూరిటి విజిలెన్స్ సిబ్బంది పర్యవేక్షణలో సీసీకెమెరాల నిఘా మధ్య నిర్వహించడం జరిగిందన్నారు. సింగరేణి మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన ఈ పరీక్షను జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ పి. సామ్యూల్ సుధాకర్, జీఎం (ఈఅండ్ఎం) విజిలెన్స్ కే. ప్రసాదరావు పర్యవేక్షించి పరీక్ష పూర్తిగా మెరిట్‌పై ఆధారపడి ఉంటుందని, దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని, వారిని నమ్మి ఎవరు మోసపోవద్దని సూచించారు. ఈ పరీక్ష ఫలితాలు అదే రోజు రాత్రి నుంచే సింగరేణి వెబ్‌సైట్, సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం వద్ద నోటీసుబోర్డు ద్వారా తెలియచేయడం జరుగుతుందన్నారు. ఈ పరీక్ష నిర్వహణ పరిశీలనలో డీజీఎం (పర్సనల్) పి. వేణుగోపాలరావు, విజిలెన్స్ ఆఫీసర్ డి. వీరయ్య, పర్సనల్ మేనేజర్ కే. ప్రకాశరావు, సమ్మయ్య, డీవైపీఎంలు నాగేశ్వరరావు, సంతోష్‌కుమార్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద, ఇతర అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

▸ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఛైర్మన్ చీమ శ్రీనివాస్



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యమకారులు

ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు15: తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ప్రారంభించిన 33 జిల్లాల చైతన్యయాత్రలో భాగంగా దక్షిణ తెలంగాణ ఉద్యమకారుల యాత్ర ఆదివారం ఖమ్మం చేరుకున్న సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యమకారులు ఘనంగా స్వాగతం పలికారు. తొలుత నగరంలో అమరవీరుల స్థూపం నుంచి పాతబస్టాండ్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల స్థలం, పెన్షన్ రూ.25వేలు, ఉద్యమకారుల గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. అలాగే ఉద్యమకారుల సంక్షేమ బోర్డుకు రూ.10వేల కోట్లు బడ్జెట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు అనంతరం ఈనెల 27న సికింద్రాబాద్‌లో జరిగే ఉద్యమకారుల సన్మాన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఖమ్మం జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఛైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు, అర్వపల్లి విద్యాసాగర్, పసుపులేటి నాచరయ్య, పగడాల నరేదర్, బచ్చల పద్మాచారి, రెడ్డిబోయిన వరలక్ష్మి, రాచమల్ల ఉమాయాదవ్, పాలకుర్తి కృష్ణ, కొప్పెర జానకిరాములు,

ప్రకృతి మిత్ర ఫౌండేషన్‌కు నంది పురస్కారం


పురస్కారాన్ని అందిస్తున్న కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సభ్యులు

చుంచుపల్లి, సెప్టెంబరు15: ప్రకృతి మిత్ర ఫౌండేషన్ ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి రోజు మొక్కలు నాటుతున్న ప్రకృతి ప్రేమికుడు చిరంజీవి విశ్వామిత్ర చౌహాన్‌కు నంది పురస్కారం వరించింది. ఆదివారం ఈ అవార్డును విజయవాడలో బాలోత్సవ్ భవన్‌లో కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు ప్రధానం చేశారు. ఈ జాతీయ స్థాయి నంది పురస్కారానికి పర్యావరణ విభాగంలో చుంచుపల్లి మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీకు చెందిన ఐదేళ్ల మూడ్ విశ్వమిత్ర చౌహాన్ ఎంపికవడంపై భద్రాద్రి జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అందజేసిన వారిలో నిర్వాహకులతో పాటు ఝాన్సీ లక్ష్మీబాయి వారసురాలు శాంతబాయి, గుర్రం జాషువ వారసురాలు రేవతి, పూర్వ నాసా శాస్త్రవేత్త సాంబశివరావు, విశ్వామిత్ర తల్లిదండ్రులు మూడ్ జయరాం, అనూష తదితరులు ఉన్నారు.

విద్వేషాలను రెచ్చగొడుతున్న కౌశిక్‌రెడ్డి

▸ జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ మాజీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్


పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం, సెప్టెంబరు15: అన్నదమ్ములుగా ఉంటున్న తెలంగాణ, ఆంధ్ర ప్రజల మధ్య కౌశిక్‌రెడ్డి ప్రాంతీయ విద్వేషాలను రెచ్చ గొడుతున్నారని ఖమ్మం జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ మాజీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ అన్నారు. ఆది వారం తెలంగాణ ప్రభుత్వం చంద్రబాబునాయుడు ట్రాప్‌లో పడిందని, ఆయన ఆదేశాల మేరకు హైడ్రా చట్టాన్ని హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డి అమలుపరుస్తున్నారంటూ, తప్పుడు ఆరోపణలకు నిరసనగా చంద్ర ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అభివృద్ధి ఆగిపోయి పెట్టుబడులన్నీ అమరావతి తరలించాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారంటూ కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. గత కొన్ని రోజులుగా ఇద్దరు ఎమ్మెల్యేలు వ్యక్తిగత ఆరోపణలు చేసుకుంటూ, ఈ విషయంతో ఎటువంటి సంబంధంలేని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుని తీసుకురావడం సరైందికాదన్నారు. ఇటీవల విజయవాడలో వరదల సందర్భంగా చంద్రబాబు చేసిన సేవలను చూసి ప్రపంచమంతా హర్షిస్తుంటే, కౌశిక్‌రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేయ దం వెనక కేవలం రాజకీయ పబ్బం కోసమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతనిప్పు నాగేశ్వరరావు, కన్నేటి పృథ్వీ, కర్నాటి సీతారాములు, నాగాండ్ల లక్ష్మణ్, కూచిపూడి జై, బైరా అప్పారావు, ఒక్కంతల వంశీ, కన్నా, చల్లగుండ్ల రమేష్ , బోడెపూడి రవి, దామాల శివ, నల్లమోతు రంగారావు, తాళూరి నారాయణరావు, నార్వనేని శంకర్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌కు గురై రైతుకు గాయాలు

కారేపల్లి, సెప్టెంబరు15: విద్యుత్‌షాక్‌కు గురై ఓ రైతుకు గాయాలైన సంఘటన మండల పరిధిలోని చింతలతండ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. చింతలతండా గ్రామానికి చెందిన రైతు భూక్యా కిషన్ చీమలపాడు గ్రామ సమీపంలో గల తన పొలానికి నీళ్లు పెట్టేందుకు విద్యుత్ మోటార్‌ను ఆన్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. ఇది గమనించిన పరిసర ప్రాంత రైతులు అతడిని గ్రామంలోని ఆర్ఎంపీ వద్ద ప్రథమ చికిత్స అనంతరం, మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కిషన్ పరిస్థితి విషయంగా ఉందని సమాచారం.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు..

కారేపల్లి, సెప్టెంబరు15: విధులలో పాల్గొనేందుకు వెళ్తున్న ఓ హోంగార్డుకు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయల పాలైన సంఘటన ఆదివారం మండల పరిధిలోని చీమలవారిగూడెం సమీపంలో చోటు చేసుకుంది. ఖమ్మం ట్రాఫిక్‌లో విధు లు నిర్వహిస్తున్న బానోత్ చందర్ కారేపల్లి మండల పరిధిలోని మాధారం గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై ఖమ్మం వెళ్తుండగా, చీమలవారిగూడెం సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. తీవ్రగాయాలైన అతడిని స్థానికుల ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. కాగా హోంగార్డు చందర్ ఆరోగ్య పరిస్థితి విషయంగా ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఉషు క్రీడల్లో రాణిస్తున్న భావన

● ఖేలో ఇండియా క్రీడల్లో ఐదో స్థానం


భావనను అభినందిస్తున్న మేనేజర్ శ్రీనివాస్

చుంచుపల్లి, సెప్టెంబరు15: కనుమరుగైన భారతీయ సంప్రదాయ క్రీడ ఉషులో భద్రాద్రి జిల్లాకు చెందిన పదమూడు సంవత్సరాల వయస్సు కలిగిన గోవర్ధనగిరి భావన ఉత్తమ ప్రదర్శనను కనబరుస్తుంది. కొత్తగూడెం పట్టణంలో సెయింట్ మేరీస్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న భావన చిన్నతనం నుంచి క్రీడలపై మొగ్గు చూపడంతో తల్లిదండ్రులు గమనించి శిక్షణ ఇప్పించారు. రోడ్డు భవనాల శాఖలో ఉద్యోగిగా పని చేసే తండ్రి రమేష్, తల్లి గౌరీ ప్రోత్సహించారు. ఈ విషయాన్ని ఉషూ మాస్టర్ పరిపూర్ణచారీ, కోచ్ రాచర్ల రఘు వద్ద శిక్షణను అందించేందుకు తరగతులను ప్రారంభించారు.

ఉషు క్రీడల్లో కర్ణాటక రాష్ట్రంలో బగాకోట్ జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్‌లో భద్రాద్రి జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించి 5వ స్థానాన్ని సాధించింది. కాగా త్వరలో జరగనున్న జాతీయ సబ్ జూనియర్స్ క్రీడల్లో పాల్గొనేందుకు పట్టుదలతో శ్రమిస్తుంది. కొత్తగూడెం ఏరియా పివికె-5 గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. మరెన్నో పోటీల్లో పాల్గొని రాణించాలని ఆకాంక్షించారు. ఒలంపిక్స్ క్రీడల్లో పాల్గొని ఉషు క్రీడా విభాగం లో దేశానికి పథకం సాధించడమే జీవిత లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు క్రీడాకారిణి భావన తెలిపింది.

పాఠశాలలో వస్తువులు ధ్వంసం

▸ రూ.3లక్షల మేర ఆస్తినష్టం ▸ సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ


పాఠశాలలో సంఘటనను పరిశీలిస్తున్న డీఎస్పీ శరత్‌కుమార్

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 15: అశ్వారావుపేట మండలంలోని మామిళ్లవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు బీభత్సం సృష్టించారు. పాఠశాలలో ఉన్న ఎల్ఈడీ స్క్రీన్‌తో పాటు ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. సుమారు రూ.3లక్షల మేర నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళితే పాఠశాలకు శనివారం సెలవు కావడంతో శుక్రవారం సిబ్బంది యథావిధిగా తాళాలు వేసి వెళ్లారు. పాఠశాలలో శనివారం ఐదు గంటల వరకు కొందరు పిల్లలు ఆడుకున్నారు. అప్పటివరకు ఎటువంటి సంఘటన జరిగినట్లు దాఖలాలు లేవు. అయితే ఏడున్నర సమయంలో అటుగా వెళుతున్న కొందరు పాఠశాల తాళాలు తీసి ఉండటం గమనించి హెచ్‌ఎం ప్రసాదరావుకు సమాచారం అందించారు. అనంతరం సమాచారం అందుకున్న పోలీసులు పాఠశాలకు వెళ్లగా పిల్లలకు సాంకేతిక విద్యను బోధించే ఎల్ఈడీ స్క్రీన్‌ను పూర్తిగా ధ్వంసం చేశారు. కార్యాలయ గదిలోకి వెళ్లి బీరువాను పగలగొట్టి వస్తువులను చిందరవందరగా పడేశారు. తలుపులను ధ్వంసం చేశారు. ఇదే తరుణంలో ఆదివారం పాల్వంచ డీఎస్పీ శరత్‌కుమార్, సీఐ కరుణాకర్, ఎస్ఐ శివరామకృష్ణ మరోసారి పాఠశాలకు జరిగిన ఘటనను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం అక్కడ ఉన్న వేలిముద్రలను సేకరించారు. హెచ్‌ఎం ప్రసాదరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

▸ ఆటో, ద్విచక్రవాహనం సీజ్ ▸ నలుగురిపై కేసు నమోదు


వెంగన్నపాలెంలోని కోళ్లఫారంలో నిల్వచేసిన రేషన్‌బియ్యం

జూలూరుపాడు, సెప్టెంబరు 15: అక్రమంగా నిల్వచేసిన, రవాణా చేస్తున్న 22 క్వింటాల రేషన్ బియ్యాన్ని పట్టుకుని ఆదివారం సీజ్ చేసినట్లు కొత్తగూడెం సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్ఐ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఆర్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన దొడ్డి కిరణ్ అనే వ్యక్తి ప్రజల వద్ద నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వెంగన్నపాలెం గ్రామంలో లీజ్‌కు తీసుకొన్న ఓ కోళ్లఫారంలో అక్రమంగా నిల్వ చేశాడు. సమాచారం మేరకు ఆర్ఐ దాడులు నిర్వహించి 17 క్వింటాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. జూలూరుపాడు గ్రామానికి చెందిన కొమ్మిన్ని నాగేశ్వరరావు 2క్వింటాలు రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నారు. అదే విధంగా అన్నారపాడు గ్రామానికి చెందిన గుగులోత్ వినోద్, బిప్రసాద్‌లు ద్విచక్ర వాహనంపై 3క్వింటాల బియ్యాన్ని తరలిస్తుండగా కొమ్ముగూడెం గ్రామం వద్ద పట్టుకున్నారు. ఆటో, ద్విచక్ర వాహనాన్ని సీజ్‌చేసి నలుగురు వ్యక్తులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

40 లీటర్ల గుడుంబా స్వాధీనం

భద్రాచలం, సెప్టెంబరు 15: అక్రమంగా తరలిస్తున్న 40 లీటర్ల గుడుంబాను భద్రాచలంలో ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆదివారం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. గుడుంబాను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి ఆటో, బైక్, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఏఈఎస్ తిరుపతి, సిబ్బంది రమేష్, కరీం, బాలు, భిక్షం, అలీమ్ పాల్గొన్నారు.

ముడిచమురు దిగుమతులపై సుంకం పెంచటం పట్ల హర్షం



దమ్మపేట, సెప్టెంబరు 15: ముడిచమురు దిగుమతులపై సుంకాన్ని పెంచటం పట్ల దమ్మపేట మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. దమ్మపేటలో ఆదివారం ఆయన మాట్లాడుతు వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రైతుసంఘం నాయుకులు ఆలపాటి రాంచంద్రప్రసాదు కృషితో ముడిచమురుపై దిగుమతి సుంకాన్ని పెంచటానికి కృషి చేసారని అన్నారు. గతంలో కేంద్రప్రభుత్వం దిగుమతి సుంకం తగ్గించటంతో ఆయిల్‌ఫాం గెలల ధరలు పతనం కావటంతో పాటు దిగుబడులు సైతం తగ్గటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఈ చర్యలతో రైతులకు ఊరట కలిగిందని ఆయన అన్నారు. కేంద్రవ్యవసాయశాఖా మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్రపామాయిల్ అడ్వైజరీకమిటి సభ్యులు ,పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్ లకు పైడి వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై మంత్రుల కమిటీని వ్యతిరేకిస్తున్నాం..

» ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి

పాల్వంచ టౌన్, సెప్టెంబరు 15: ఎస్సీవర్గీకరణపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేసిన మంత్రుల అధ్యయన కమిటిని వ్యతిరేకిస్తున్నామని జిల్లా ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి (జేఏసీ) కన్వీనర్ ఎస్. మధుసూధన్‌రావు తెలిపారు. ఆదివారం పాల్వంచ దమ్మపేట సెంటరులో జరిగిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి జేఏసీ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కమిటి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం వర్గీకరణ అంశాన్ని నిష్పక్షపాతంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించి సిఫార్సు చేయాలన్నారు. కానీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కమిటిని చూస్తే వర్గీకరణ అమలు జరిగినట్లే అనిపిస్తుందని కమిటీలో మాలకులానికి చెందిన మంత్రి లేడు.. ఇక ఈ కమిటి పారదర్శకంగా సర్వే చేస్తుందనే నమ్మకం లేదన్నారు. ఈ కమిటీని రద్దు పర్చి హైకోర్టు సిట్టింగ్ జడ్జి, రిటైర్డ్ జడ్జిచే కమిటి వేసి అధ్యాయనంచేసి ఆ కమిటిలోరాష్ట్ర మాలమహానాడు జాయింట్‌యాక్షన్‌కమిటి నాయకులకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సలహాదారులు దాసరి నాగేశ్వరరావు, వాసుమల్ల సుందర్ రావు, తోటమళ్ల రమణమూర్తి, గిడ్ల పరంజ్యోతిరావు, కో కన్వీనర్లు ఎడెల్లి గణపతి, కూరపాటి రవీందర్, దారా చిరంజీవి, తుంపురు శివ, దాసరి శేఖర్, కోశాధికారులు సుబ్బారావు, నాగేందర్, శ్రీను, మహిళా కన్వీనర్ మెరుగు అనసూర్య, కోకన్వీనర్లు నక్కా సృజన, దారా లక్ష్మి, బోడ దివ్య, మంద లత, ముద్దమళ్ల రోహిణి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ మధుసూధన్‌రావు

వరద బాధితులకు నిత్యవసరాల పంపిణీ

మణుగూరు, సెప్టెంబరు 15: భారీ వర్షాలకు స్వరం కోల్పోయిన వరద బాధిత కుటుంబాలకు హైదరాబాద్‌కు చెందిన చిన్నజీయర్ స్వామి వికాస తరంగిణి భక్త బృందం ఆదిఆవారం నిత్యవసరాలను పంపిణీ చేశారు. మేదర్ బస్తీ, సుందరయ్య నగర్ దిగువ ప్రాంతంలో నివాసముండే 200 కుటుంబాలకు ఈ వితరణ అందజేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి నిర్వాహకులు, తహసీల్దార్ రాఘవ రెడ్డి, దోసపాటి పిచ్చేశ్వరరావు. తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడి ప్రమాణస్వీకారం పట్ల హర్షం

అశ్వారావుపేట, సెప్టెంబరు 15: టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్ ప్రమాణస్వీకారం చేయటం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుంకవల్లి వీరభద్రరావు, సహకార సంఘం అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. సుంకవల్లి నివాసంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు ప్రసాద్, కానూరి మోహనరావు ఉన్నారు.

మరోసారి తెరపైకి

జల కాలుష్య నివారణ పథకం

» రెండు దశాబ్దాల తరువాత
మంత్రి తుమ్మల ఆదేశాలతో కదలిక
» అంచనాల రూపకల్పనకు
సన్నద్ధమవుతున్న అధికార యంత్రాంగం
» గతంలో నిర్వహణ భారంతో అటకెక్కిన పథకం

భద్రాచలం, సెప్టెంబరు 15: భద్రాచలంలో జల కాలుష్య నివారణ పథకం మరోసారి తెరపైకి వచ్చింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల భద్రాచలంలో అధికార యంత్రాంగంతో సమీక్షలో వ్యర్థ జలకాలుష్య పథకం రూపకల్పనకు అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. దీంతో అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి సాంకేతికపరంగా పరిశీలించి తుది అంచనాలను తయారు చేసేందుకు సన్నద్ధమవుతోంది. రెండు దశాబ్దాల క్రితం భద్రాచలంలో ఆనాడు జలకాలుష్య నివారణ పథకాన్ని ఏర్పాటు చేయగా బాలారిష్టాలను కూడా దాటకుండానే ఆనాడు నిర్వహణ భారంతో ఆ పథకం అటకెక్కింది. రెండు దశాబ్దాలుగా పాలక ప్రభుత్వాలు ఏ మాత్రం ఈ కీలక అంశంపై దృష్టిసారించకపోవడంతో గతంలో వేసిన పైపులు పూడుకుపోయి గతంలో సుందరయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన ట్రీట్‌మెంటు ప్లాంట్లు రెండు దశాబ్దాలుగా మూలనపడ్డాయి. తాజాగా మంత్రి తుమ్మల భద్రాద్రి పట్టణంలోని వ్యర్థ జలాలు గోదావరిలో నేరుగా కలపవద్దని వాటిని శుద్ది చేసి గోదావరిలో కలపాలని జిల్లా అధికార యంత్రాంగంను ఆదేశించారు. ఈ క్రమంలో గతంలో ఉన్న జల కాలుష్య నివారణ పథకం శిధిలావస్థకు చేరిందని అధికారులు మంత్రి దృష్టికి తేగా అవసరమైతే తాజాగా మళ్లీ అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. దీంతో మరోసారి జలకాలుష్య నివారణ పథకం అంశం తెరపైకి వచ్చింది.


వినియోగించకుండా దశాబ్దల కాలంగా ఉన్న జనరేటర్

2004లో పథకం పూర్తి.. 2005లో పథకం అటకెక్కింది

బాలారిష్టాలను సైతం దాటని జలకాలుష్య నివారణ పథకం గోదావరి నదీ పరివాహక పట్టణాలు, గ్రామాల్లో వెలువడుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం 2001లో ఈ నిర్మాణం చేపట్టి 2004లో రూ.3 కోట్లతో భద్రాచలంలో గోదావరి జల కాలుష్య నివారణ పథకాన్ని నిర్మించింది. నాడు దాని ఆలన పాలన విస్మరించడంతో జల కాలుష్య నివారణ పథకం 2005లోమూలన పడింది. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న ఉమ్మడి రాష్ట్రంలోని మంచిర్యాల, రామగుండం, భద్రాచలం, రాజమండ్రిల్లో ఆనాడు రూ.34.19 కోట్లను వెచ్చించి ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. 2005 వరకు ఈ పథకం నిర్వహణ బాధ్యతలు కాంట్రాక్టరే నిర్వహించగా అనంతరం ఈ పథకం నిర్వహణ అటకెక్కింది. పథకం నిర్వహణకు ఏటా రూ.60 లక్షలు వరకు కావాల్సి ఉంటుందని అధికారులు రెండు దశాబ్దాల క్రితమే చేతులెత్తేసారు. ప్రస్తుతం పథకం నిర్వహణ లేకపోగా ఆనాడు కొనుగోలు చేసిన జనరేటర్ వర్షానికి తడిసి ఎండకు ఎండి తుప్పు పట్టింది. ఇదిలా ఉండగా జలకాలుష్యం నుంచి గోదావరిని పరిరక్షించాలంటే ప్రస్తుతం ఉన్న పథకం ఎందుకు పనికి రాదని నూతనంగా జల కాలుష్య నివారణ కోసం చర్యలు చేపట్టక తప్పదని తెలుస్తోంది. ఇందు కోసం కోట్లలో నిధులు వెచ్చించాల్సి ఉంటుందని అలాగే నిర్వహణ కోసం ప్రత్యేకమైన సిబ్బంది విద్యుత్తు బిల్లుల చెల్లింపు ఇతరత్రా వాటి కోసం ప్రతి ఏటా కోట్ల రూపాయలు వెచ్చించాల్సి ఉంటుందని సమాచారం.

మండపాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు, నిమజ్జనాలు

గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్వంచలో మంత్రి పొంగులేటి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల, కొత్తగూడెం లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భద్రాచలంలో ఐటీడీఏ పీవో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. మండపాల వద్ద పలువురు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో నిమజ్జనం చేశారు. అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు ఏర్పాటుచేశారు.


మణుగూరులో పూజలో పాల్గొన్న పోలీసులు


కొత్తగూడెంలో ఎమ్మెల్యే కూనంనేనిని సత్కరిస్తున్న దృశ్యం


మంత్రి పొంగులేటిని సత్కరిస్తున్న దృశ్యం


అశ్వారావుపేటలో మహిళల పూజలు


భద్రాచలంలో నిమజ్జనంలో పాల్గొన్న పీవో రాహుల్ దంపతులు


కొత్తగూడెం హోమసామగ్రిని పంపిణీ చేస్తున్న ఉత్సవకమిటీ సభ్యులు


జూలూరుపాడులో అన్నదానం

జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 15: ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్‌కు జీవో నెంబరు 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, జిల్లా కోశాధికారి సతీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అశ్వారావుపేటలోని సీహెచ్‌సీలో ఆదివారం కాంట్రాక్ట్ వర్కర్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ చెల్లించటం లేదని విమర్శించారు. సమావేశంలో నాయకులు ప్రభాకర్, బుచ్చిరాజు, కాంట్రాక్ట్ వర్కర్స్ రహమత్, నాగమణి, వెంకటేశ్వరరావు, సుజాత, స్వాతి, వెంకటకృష్ణతో పాల్గొన్నారు.

నిమజ్జన ఊరేగింపులో డీజే నిషేధం: ఎస్‌ఐ

చుంచుపల్లి, సెప్టెంబరు 15: నిమజ్జన ఊరేగింపుల్లో డిజే నిషేధమని ... ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చుంచుపల్లి ఎస్‌ఐ రవికుమార్ ఆదివారం హెచ్చరించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులో రాష్ట్ర హైకోర్టు ఆదేశాలనుసారం డిజే సౌండ్ బాక్స్‌లు నిషేధం చేయడం జరుగుతుందన్నారు. సోమవారం, మంగళవారం రోజుల్లో జరిగే గణేష్ నిమజ్జన ఊరేగింపులో అనుమతులు పొందిన సమయంలో సూచించిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కావునా చుంచుపల్లి మండల ప్రజలు పోలీస్ వారికి సహకరించగలరని కోరారు. నిమజ్జనంను శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని , ఎవరైనా మద్యం సేవించి అల్లర్లు చేసిన, గొడవలు జరిగేలా ప్రవర్తిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

కాలుష్యనియంత్రణ సామాజిక బాధ్యత: మునిసిపల్ చైర్మన్

ఇల్లెందు. సెప్టెంబరు 15: కాలుష్యాన్ని నియంత్రంచకపోతే భావి తరాలకు తీవ్ర నష్టం జరుగుతుందని.. కాలు ష్యం బెడద లేని. వాహనాలు రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావాలని కోరారు. ఆదివారం పట్టణంలో ఏకో తేజస్ సిద్ధ విద్యుత్ వాహనాల హబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజల కు తక్కువ ధరల్లో అందుబాటులో వుండే విధంగా విద్యుత్ వాహనాలు రూపొందించడం అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమంలో మచ్చ వెంకటేశ్వర రావు. మున్సిపల్ కౌన్సిలర్ లు కోక్కు. నాగేశ్వరరావు. కటకం పద్మావతి. ఏ ఐ టీ యు సి నాయకుడు కే సార య్. కాంగ్రెస్ నాయకులు కనగాల పేరయ్య. డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.


ఎలక్ట్రిక్ హబ్ ప్రారంభించిన దమ్మాలపాటి

రూ.29 లక్షలకు లడ్డుపాట పాడిన వ్యాపారి

ఇల్లందుటౌన్, సెప్టెంబరు 15: ఇల్లెందుకు చెందిన ప్రముఖ వ్యాపారి కొండపల్లి గణేష్ ఆదివారం హైదరాబాద్‌లో వినాయక లడ్డును రూ. 29 లక్షలకు దక్కించుకున్నారు. ఇల్లెందు పట్టణంలోని 21 వార్డు కౌన్సిలర్ కొండపల్లి సరిత భర్త గణేష్ హైదరాబాద్‌లోని ప్రముఖ గెటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ పై హోం భూజాలో జరిగిన వినాయక లడ్డు వేలంలో పాల్గొని అత్యధికంగా రూ. 29 లక్షలకు వేలం దక్కించుకున్నారు.

భక్తిశ్రద్ధల మధ్య గణపతి మాలధారుల ఇరుముడి


ఇరుముడులతో స్వాములు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 15: అశ్వారావుపేటలో ఆదివారం గణపతి మాలాధరుల ఇరుముడి కార్యక్రమం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద నిత్యం హోమాలు, పూజుల నిర్వహించారు. తొమ్మిది రోజుల పూజల అనంతరనం ఆదివారం ఉదయం ఇరుముడిని నిర్వహించారు. ఇరుముడి, పూర్ణాహుతి కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నిర్వాహకులు పాల్గొన్నారు.

దేశం గర్వించే ఇంజనీరు మోక్షగుండం

» సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ సత్యనారాయణ

కొత్తగూడెం, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): దేశం గర్వించే ఇంజనీరు భారతరత్న గ్రహిత శ్రీ మోక్షగుండం విశ్వేశ్వర రావు అని సింగరేణి సంస్థ డైరెక్టర్ (ఈఅండ్ఎం) ఆపరేషన్స్ డి. సత్యనారాయణ అన్నారు. ఆదివారం సింగరేణి కాలరీస్ కార్పోరేట్ ఏరియా సివిల్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో హెడ్డాఫీస్ ఎదురుగా ఉన్న మోక్షగుండం విశ్వేశ్వరరావు 164 జయంతి, 57వ ఇంజనీర్స్‌డే వేడుకలను నిర్వహంచారు. ఈ వేడుకలో సంస్థ డైరెక్టర్‌తోపాటు వివిధ విభాగాల జీఎంలు, అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరరావు కాంశ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చాలా నిరాండబరమైనటువంటి స్థాయి నుంచి ప్రపంచం గర్వించదగ్గ ఇంజనీర్లలో ఒకరుగా ఎదగడం భారతదేశానికి ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంల సాయిబాబు, సూర్యనారాయన, కృష్ణయ్య, సామ్యూల్ సుధాకర్, శ్రీనివాసరావు,సోమయాజుల వి. రామమూర్తి, గుర్తింపు సంఘం (ఎటీయూసీ) బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌వి. రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం కార్పోరేట్ వైస్ ప్రెసిడెంట్ పీతాంబరం, వివిధ విభాగాల ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సింగరేణి డైరెక్టర్

టీడబ్ల్యుజేఎఫ్ బలోపేతానికి సమష్టిగా కృషి చేయండి

భద్రాచలం, సెప్టెంబరు 15: అనునిత్యం పాత్రికేయుల సమస్యలపై నిర్విరామంగా కృషి చేస్తున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ సంఘాన్ని పాత్రికేయులంతా సమష్టిగా కృషి చేసి బలోపేతం చేయాలని సంఘ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌రెడ్డి పిలుపునిచ్చారు. భద్రాచలంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబరు 26, 27 తేదీల్లో జర్నలిస్టులకు వృత్తినైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. విలేకర్లు పాల్గొన్నారు.

పర్ణశాలలో నిమజ్జనం ప్రమాదకరం: ఎస్‌ఐ

దుమ్ముగూడెం సెప్టెంబరు 15: గోదావరి వరదల దృష్ట్యా పర్ణశాల గోదావరి తీరంలో వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రమాదకరమని ఎస్‌ఐ గణేష్ తెలిపారు. భద్రాచలం గోదావరి నది ఒడ్డున అన్ని ఏర్పాట్లు చేసినందున అక్కడకు వెళ్లాలని సూచించారు. లక్ష్మీనగరం నుంచి భద్రాచలం వెళ్లేందుకు ట్రాక్టర్ల సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.


రామయ్యను దర్శించుకున్న ఓఎస్‌డీ పరితోష్ పంకజ్

వరద బాధితులకు అండగా ఉంటా: కొత్వాల

పాల్వంచ రూరల్, సెప్టెంబరు 15: మండలంలోని ఉల్వనూరు వరద బాధితులకు అండగా ఉంటామని ఈ మేరకు ఆదివారం రూ.2లక్షల విలువ చేసే నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. వరద ముంపునకు గురైన వారికి తక్షణ సహాయంగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని మంత్రి శ్రీనివాసరెడ్డి ఆదేశించారని అన్నారు. ఉల్వనూరులో 63మంది కుటుంబాలు వరద ముంపుకు గురయ్యారన్నారు. ప్రభుత్వం ద్వారా 63మందికి ఒక్కొక్కరికొప్పున రూ.16,500లు వారి ఖాతాలో జమచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీచైర్మన్లు కంచర్ల చంద్రశేఖర్, బరపాటి వాసుదేవరావు, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊకంటి గోపాలరావు, మురళీ, పెద్దబాబు, మండె హనుమంతరావు, రాంబాబు, బాలినేని నాగేశ్వరరావు, కాపర్తి వెంకటాచారి పాల్గొన్నారు.

రూ.40వేలు పలికిన గణేష్ లడ్డూ

దమ్మపేట, సెప్టెంబరు 15: మొద్దులగూడెం గ్రామంలో గణేష్ మండపం వద్ద ఆదివారం నిర్వహించిన వేలంపాటలో లడ్డూ ధర రూ .40వేలు పలికింది. సొసైటి మాజీచైర్మన్ దొడ్డా సత్యం లడ్డూను రూ.40వేలు దక్కించుకోగా ఆలయకమిటి సభ్యులు లడ్డూను అందజేసారు. ఈకార్యక్రమంలో బచ్చు సత్యనారాయణ, దొడ్డా బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


దొడ్డా సత్యం

మిత్రుడి వైద్య సేవలకు ఆర్థికసాయం అందజేత

మణుగూరు, సెప్టెంబరు 15: తమ చిన్న నాటి స్నేహితుడు ఒకరు అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ వైద్య చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా ఆయనకు అండగా నిలిచారు చిన్న నాటి మిత్రులు. తమ వంతు ఆర్థిక సాయాన్ని అందించడంతో పాటు కుటుంబ పోషణ కొసం బియ్యం కూడా అందజేశారు. మండలంలోని రామానుజవరం గ్రామానికి చెందిన పల్లపు శ్రీనివాస్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న చిన్నతనంలో ఏడో తరగతి చదువుకున్న అక్కి. నర్సింహారావు, సీతారామరాజు, గుండగాని వెంకట్రావ్, బాల భద్రయ్య, దొంతసర్వ వీరన్న పాయం రామకృష్ణ దాచేపల్లి రవీందర్, గుండగాని ముత్తయ్య, రామలింగయ్య, ఎస్‌కే యూసఫ్‌పాషా,లలిత మంజుల తదితరులు రామానుజవరం గ్రామానికి చేరుకుని శ్రీనివాస్‌తో మాట్లాడారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న శ్రీనివాస్‌కు అంతా కలసి రూ.30 వేలను ఆర్థిక సాయంగా అందించారు. మిత్రులు చేసినసహకారంపై గ్రామస్థులు అభినందనలు తెలిపారు.


ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలి: సింగరేణి జీఎం

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 15: సింగరేణిలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ సూచించారు. ఆదివారం ఏరియాలోని వర్క్‌షాపులో భద్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు భద్రత, రక్షణ సూత్రాలపై అవగాహన పెంచేందుకు సింగరేణి యాజమాన్యం తీవ్రంగా కృషి చేస్తుందన్నారు. స్థానిక సమస్యలపై స్పందించిన జీఎం త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగులు ఎవరైన తాము నిర్వహిస్తున్న విధులకు ఆటంకం కలిగించినట్లైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాపు ఇన్‌చార్జ్ నాగరాజునాయక్, ఇంజనీరు వీరునాయక్, సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపల్లెలో ఎర్రజెండా రెపరెపలాడాలి: కూనంనేని

● ఎమ్మెల్యే సమక్షంలో 60 కుటుంబాలు సీపీఐలో చేరిక

సుజాతనగర్, సెప్టెంబరు 15: పల్లె ప్రజలకు కావాల్సిన కనీస వసతుల కల్పనకు నిరంతర కృషి జరుగుతోందని, నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలులేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నిరంతర కృషి జరుగుతోందని, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఆదివారం సుజాతనగర్ మండలంలోని పాత అంజనాపురం గ్రామ పంచాయతీలోని చిమ్నాతండాలో కూనంనేని సమక్షంలో 60 కుటుంబాల వారు సీపీఐలో చేరారు. వీరికి ఎమ్మెల్యేతో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే. సాబీర్‌పాషా ఎర్రజెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి వైపు ఉరకలు వేయిస్తానన్నారు. ప్రతి పల్లెలో ఎర్రజెండా రెపరెపలాడటం ఖాయమని, నియోజకవర్గంలో సీపీఐకి ఎదరులేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు భూక్యా దస్రు, కోమారి హనుమంతరావు, రాములు, నాయకులు తాళ్లూరి పాపారావు, పొదిల శ్రీనివాస్, తాళ్లూరి ధర్మారావు, కోమారి కృష్ణ, మల్లేష్, గోపి, భాగం మోహన్‌రావు, బండి రమేష్, చిన్న కృష్ణ, ఊకే నాగేశ్వరరావు, బాలు, సురేష్, పోటు వెంకటేశ్వరరావు, జాన్ విక్టర్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కూనంనేని